సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 22 । డిసెంబర్ । 2023



ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని టీటీడీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. -8లో



గ్రామస్తుల సహకారం మరువలేనిది

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సహకరించిన నక్కవాండ్లపల్లి గ్రామస్తులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 228 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పుణ్యక్షేత్రాల పేరిట ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి రాము అన్నారు. గురువారం స్థానిక టు డిపో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి తిరువణ్ణామలైకి ప్రతి డిపో నుంచి స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ములకలచెరువు ఆర్టీసీ బస్టాండులోని ఖాళీ స్థలం లీజుకు ఇవ్వనున్నట్లు డీటీఓ రాము తెలిపారు.

ఇంటర్వ్యూల నిర్వహణ

రాయచోటి అర్బన్: స్త్రీ,శిశు సంక్షేమశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న పలుపోస్టులకు గురువారం అధికారులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఖాళీగా ఉన్న డీసీపీఓ, పిఓఐసి, పిఓఎన్ఐసి, ఎల్‌సిపిఓ, ఎల్‌సిపిఓ కౌన్సిలర్ ఎస్‌డబ్ల్యూ, డాటా అనలిస్ట్ తదితర పోస్టులకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఐసిడియస్ ఇన్‌చార్జ్ పిడి ధన లక్ష్మి, జిల్లా సోషియల్ వెల్ఫేర్ అధికారి జాకీర్‌హుస్సేన్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సుభాష్ యాదవ్‌లు 250 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్: జిల్లాలోని పలు మండలాలు, మున్సిపాలిటీలలో ఖాళీగా ఉన్న వార్డు, గ్రామ వలంటీర్ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 23 మండలాలు, 3 మున్సిపాలిటీ లలో 97 వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 23న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు.23 నుంచి జనవరి 3 వరకు దరఖాస్తుల స్వీకరణ, 24నుంచి జనవరి 4వరకు పరిశీలన కార్యక్రమం ఉంటుందన్నారు. జనవరి 5 నుంచి 7 వరకు ఇంటర్వ్యూల నిర్వహణ ,8న ఎంపిక చేసిన అభ్యర్థుల ప్రకటన, 10న నియామక పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.

నేడు శ్రీవారి పాదాల స్థూపం ఆవిష్కరణ



బి.కొత్తకోట: హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డుపై ని ర్మించిన శ్రీవారి పాదాల స్థూపం ఆవిష్కరణోత్సవం శుక్రవారం తెల్లవారుజామున నిర్వహిస్తున్నారు. ఘాట్ రోడ్డు ప్రారంభం నుంచి కొండపై వరకు 9 కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు ఉంది. ఈ రోడ్డులో కింద నుంచి పైకి వెళ్లేటప్పుడు నాలుగో మలుపు దాటి వంద మీటర్ల దూరం వెళ్లాక అక్కడి ఎత్తుకు తిరుమలకొండ ఎత్తుకు సమానం. సరిగ్గా ఇదేస్థలంలో శ్రీవారి పాదాల స్థూపం నిర్మించారు.దీనిని శుక్రవారం ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, ఆర్డీఓ మురళీ చేతులమీదుగా ఆవిష్కరించనున్నారు.

సంక్షేమ సారథికి.. సేవాహారతి

- ఘనంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు
- నిండు నూరేళ్లు చల్లగా వర్థిల్లాలని పలువురు ఆశీర్వాదాలు
- ఎక్కడ చూసినా కేక్ కటింగ్, అన్నదానాలు, రక్తదాన శిబిరాలు

సాక్షి రాయచోటి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అన్ని వర్గాల ప్రజలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు చల్లగా జీవించాలని నేతలు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా అన్ని చోట్ల కేక్ కటింగ్‌లు చేయడంతోపాటు రక్తదానాలు, అన్నదానాలు నిర్వహించారు. పేదలకు పలుచోట్ల దుస్తుల పంపిణీ చేశారు. మరికొన్ని చోట్ల ఆటో కార్మికులకు యూనిఫాంతోపాటు కుటుంబ సభ్యులకు చీరలు అందజేశారు. ఇలా ఎక్కడ చూసినా సేవా కార్యక్రమాలతో జిల్లాలో సందడి వాతావరణం కనిపించింది. జిల్లాలో ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు, జెడ్పీ చైర్మన్ పలు సేవా కార్యక్రమాలలో పాలు పంచుకున్నారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలోని వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి,



రాజంపేటలో వలంటీర్‌లకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి తదితరులు



రాయచోటిలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

ప్రజాప్రతినిధులు, మున్సిపల్ నాయకుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. రామాపురం పార్టీ కార్యాలయంలో కూడా కేక్ కట్ చేసి కార్యకర్తలకు గడికోట తినిపించారు. రైల్వేకోడూరులో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, ఓబుళాపురం మండలంలోని జీవన జ్యోతి ఆనంద నిలయంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చిన్నమండెంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. రైల్వేకోడూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అన్ని కార్యక్రమాలలో విప్ శ్రీనివాసులు పాల్గొన్నారు. రాజంపేటలోని ప్రభుత్వాసుపత్రిలో రక్తదాన శిబిర కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వలంటీర్లకు బ్యాగ్‌లతోపాటు దుస్తులను అందజేశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకల చెరువులో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కేక్ కట్ చేసి నేతలకు అందించారు. వైఎస్ జగన్ జన్మదినం సందర్భంగా అదే నియోజకవర్గంలోని అంగళ్లల్లో జరిగిన కార్యక్రమంలో కూడా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. బి.కొత్తకోటలో మాజీ ఎంపీపీ ఖలీల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి భారీగా వచ్చి 219మంది రక్తదానం చేశారు. పీలేరు నియోజకవర్గంలోని గుర్రం కొండలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. మదనపల్లెలో పార్టీ కార్యాలయంలో నేతలు కట్ చేయగా.. మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ మనూజ రెడ్డి కేక్ కట్ చేసి కార్యకర్తలకు అందించారు.మదనపల్లెలో మల్లెల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల పవన్‌కుమార్ సుమారు 5వేల మంది ఆటో కార్మికులకు యూనిఫాం అందించడంతోపాటు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన చీరలను పంపిణీ చేశారు.



రైల్వేకోడూరులో అన్నదానం చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



అంగళ్లులో సీఎం జగన్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి తదితరులు



గుర్రంకొండలో కేక్ కట్ చేస్తున్న పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

అధునాతన టెక్నాలజీతో విద్య

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి: ప్రపంచ దేశాలతో పోటీపడేలా అధునాతన టెక్నాలజీతో రాష్ట్రంలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను అందిస్తున్నట్లు రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం రాయచోటిలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైజుస్ సహకారంతో ట్యాబ్‌ల ద్వారా విద్యను అందించడం దేశంలోనే ప్రథమం అన్నారు. పాఠాలను వీడియోల ద్వారా అందించడం ద్వారా పిల్లలకు బాగా అర్థమవుతాయని ముఖ్యమంత్రి గొప్ప ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ రాష్ట్రం, దేశ భవిష్యత్తు పిల్లల చదువులపై ఆధారపడి ఉంటుందని, అమెరికా, చైనా లాంటి దేశాలతో పోటీ పడాలంటే టెక్నాలజీతో కూడిన చదువు అవసరమన్నారు. జిల్లాలో 19729 ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్నటు తెలిపారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం, రాయచోటి మున్సిపల్‌చైర్మన్ ఫయాజ్‌బాషా పాల్గొన్నారు.



ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ గిరీషా, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తదితరులు

రేపటి నుంచి సీఎం పర్యటన

- జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల్లో పాల్గొంటారు. ఈ మేరకు అధికారిక సమాచారం అందింది.

23వ తేదీన..

- ఉదయం 10.30 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి 10.45 గంటలకు హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11.05 గంటలకు గోపవరం వద్దనున్న సెంచరీ ప్లై ఇండస్ట్రీస్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.20 గంటల వరకు అక్కడి నాయకులతో ముచ్చటిస్తారు.
- అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 11.25 గంటలకు సెంచరీ ప్లై ఇండస్ట్రీస్ వద్దకు చేరుకుంటారు.
- 11.25 నుంచి 11.30 గంటల వరకు ఇండస్ట్రీ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 11.45 గంటల వరకు ఆ పరిశ్రమ చైర్మన్‌తో మాట్లాడతారు.
- 11.45 నుంచి 11.55 గంటల వరకు మీడియం డెన్సిటీ ఫైబర్ ప్లాంట్ కంట్రోల్ రూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 11.55 నుంచి మధ్యాహ్నం 12.10 గంటల వరకు హై ప్రెజర్ ల్యామినేట్ ప్లాంట్ ప్రారంభిస్తారు.
- 12.15 గంటల వరకు అక్కడి ఉద్యోగులతో ముచ్చటిస్తారు. అనంతరం రోడ్డు మార్గాన బయలుదేరి 12.20 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 12.25 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 12.45 గంటలకు కడపలోని రిమ్స్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.50 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 12.55 గంటలకు డాక్టర్ వైఎస్సార్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్దకు చేరుకుని 1.15 గంటల వరకు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- 1.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 1.20 గంటలకు డాక్టర్ వైఎస్సార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ వద్దకు చేరుకుని 1.35 గంటల వరకు ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 1.40 గంటలకు డాక్టర్ వైఎస్సార్ క్యాన్సర్ కేర్ బ్లాక్ వద్దకు చేరుకుని 1.55 గంటల వరకు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి 2.00 గంటలకు ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వద్దకు చేరుకుని 2.20 గంటల వరకు ప్రారంభిస్తారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 2.25 గంటలకు వైఎస్సార్ క్రికెట్ స్టేడియానికి చేరుకుని 2.40 గంటల వరకు అక్కడి ఫ్లడ్‌లైట్స్ ప్రారంభిస్తారు.
- అక్కడి నుంచి బయలుదేరి 2.50 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. దివ్యాంగులకు త్రి స్కూటర్ల పంపిణీలో 2.55 గంటల వరకు గడుపుతారు.
- 2.55 గంటల నుంచి 3.00 గంటల వరకు అగ్నిమాపకశాఖకు రెస్క్యూ ఎక్విప్‌మెంట్ అందజేస్తారు.
- 3.00 నుంచి 3.10 గంటల వరకు పునర్నించిన కలెక్టరేట్‌ను ప్రారంభిస్తారు. అనంతరం కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌ను సందర్శిస్తారు.
- 3.20 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి 3.25 గంటలకు అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుంటారు.
- 3.25 నుంచి 3.35 గంటల వరకు రోడ్డు వెడల్పు పనులను ప్రారంభిస్తారు.
- 3.35 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.38 గంటలకు వై జంక్షన్‌కు చేరుకుంటారు. 3.48 గంటల వరకు అక్కడి అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు.
- అనంతరం బయలుదేరి 3.55 గంటలకు కోటిరెడ్డిసర్కిల్‌కు చేరుకుని 4.05 గంటల వరకు అక్కడ అభివృద్ధి చేసిన పనులను ప్రారంభిస్తారు.
- అనంతరం అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 4.10 గంటలకు ఏడురోడ్ల కూడలి వద్దకు చేరుకుని అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అక్కడి నుంచే మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న అంతర్జాతీయ హాకీ కోర్టుకు శంకుస్థాపన చేస్తారు.
- 4.20 గంటలకు ఏడురోడ్ల కూడలి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 4.35 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 4.45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 5.00 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 5.10 కు అక్కడి నుంచి బయలుదేరి 5.15 కు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.



24వ తేదీన..

- ఉదయం 8.15 గంటలకు ఇడుపులపాయ నివాసం నుంచి బయలుదేరి 8.20 గంటలకు వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుంటారు.
- 8.30 గంటల వరకు ఘాట్‌లో జరిగే ప్రార్థనల్లో పాల్గొని నివాళులర్పిస్తారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 8.40 గంటలకు అక్కడి ప్రార్థనా మందిరానికి చేరుకుంటారు.
- 8.40 నుంచి 11.30 గంటల వరకు అక్కడ జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు.
- 11.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.35 గంటలకు వైఎస్సార్ ఎస్టేట్‌కు చేరుకుంటారు. అక్కడ 11.45 గంటల వరకు గడుపుతారు.
- అనంతరం అక్కడ బయలుదేరి 11.50 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- మధ్యాహ్నం 12.00 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.20 గంటలకు సింహాద్రిపురం జూనియర్ కళాశాల సమీపాన ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.20 నుంచి 12.40 గంటల వరకు సింహాద్రిపురం మండల ప్రజాప్రతినిధులతో మాట్లాడుతారు.
- 12.40కు అక్కడి నుంచి బయలుదేరి 12.45 గంటలకు సింహాద్రిపురం ప్రధాన రహదారి జంక్షన్‌కు చేరుకుంటారు.
- అక్కడ 12.45 నుంచి 12.55 గంటల వరకు రోడ్డు వెడల్పు, సుందరీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 1.00 గంటకు సింహాద్రిపురంలో నిర్మించిన వైఎస్సార్ పార్క్ వద్దకు చేరుకుని 1.20 గంటల వరకు ఆ పార్క్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అనంతరం అక్కడి నుంచి బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి 1.25 గంటలకు చేరుకుంటారు. ఆ కార్యాలయ ప్రారంభోత్సవంలో 1.45 గంటల వరకు గడుపుతారు.
- అనంతరం అక్కడ బయలుదేరి 1.50 గంటలకు కొత్తగా నిర్మించిన పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుంటారు. 2.05 గంటల వరకు ప్రారంభోత్సవంలో పాల్గొంటారు.
- అనంతరం 2.10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని దాని ప్రారంభోత్సవ కార్యక్రమంలో 2.25 గంటల వరకు గడుపుతారు.
- ఆ తర్వాత అక్కడి నుంచి బయలుదేరి 2.30 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 2.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 3.00 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్‌లో దిగుతారు.
- 3.05 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.10 గంటలకు ఎకో పార్క్ మీటింగ్ ప్రదేశానికి చేరుకుంటారు.
- 3.10 నుంచి 4.40 గంటల వరకు పులివెందుల మండల ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు.
- 4.40 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 4.45 గంటలకు గెస్ట్‌హౌస్‌కు చేరుకుని ఆ రాత్రి అక్కడే బస చేస్తారు.

25వ తేదీన..

- ఉదయం 8.15 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి బయలుదేరి 8.20 గంటలకు హెలిప్యాడ్ చేరుకుంటారు.
- 8.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 8.50 గంటలకు పులివెందుల పట్టణం భాకరాపురం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 8.55 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 9.05 గంటలకు సీఎస్ఐ చర్చికి చేరుకుంటారు.
- 9.05 నుంచి 11.15 గంటల వరకు సీఎస్ఐ చర్చి ప్రార్థనల్లో పాల్గొంటారు.
- 11.15 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.25 గంటలకు భాకరాపురం హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 11.30 గంటలకు అక్కడ బయలుదేరి 12.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 12.10 గంటలకు విమానంలో బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి వెళతారు.
- 01.20కు సీఎం నివాసానికి చేరుకుంటారు.

ఉద్యోగ సిరులు



సెంచరీ ప్యానెల్స్ సంస్థ

- రేపు సీఎం చేతుల మీదుగా సెంచరీ పానెల్స్ పరిశ్రమ ప్రారంభం
- ప్రభుత్వ నిర్ణయంతో స్థానికులకు ఉపాధి
- యువత మోములో ఆనందం



ఈ యువకుడి పేరు ఎస్.లక్ష్మీనరసింహప్రసాద్. బద్వేలు పట్టణం ఎగువ బ్రాహ్మణవీధి నివాసి. ఐదేళ్ల క్రితం ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తి చేశాడు. తండ్రి మరణించడంతో ఉద్యోగం చేసి కుటుంబానికి అండగా నిలవాలనుకున్నాడు. ఈ పరిస్థితిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గోపవరం మండలంలో సెంచరీ ప్యానెల్స్ సంస్థను ఏర్పాటు చేశారు. స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలనే ప్రభుత్వ నిబంధనలతో ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఉద్యోగం దక్కింది. ఉన్న ఊరిలోనే ఉపాధి లభించడంపై లక్ష్మీనరసింహాప్రసాద్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇతని పేరు ఎస్.హరీష్. బద్వేలులోని అబ్బరాతివీధి నివాసి. ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తి చేసి హైదరాబాద్‌లో పని చేస్తుండేవాడు. స్థానికంగా అవకాశాల కోసం ఎదురుచూసేవాడు. సెంచరీ పానెల్స్ పరిశ్రమలో ప్రొడక్షన్,క్వాలిటీ ఆపరేటర్ ఉద్యోగం దక్కింది. తల్లిదండ్రుల చెంతనే ఉండటం ఆనందంగా ఉందని హరీష్ చెబుతున్నాడు.

సాక్షి ప్రతినిధి, కడప: పారిశ్రామిక ప్రగతి సాధించాలనే కృతనిశ్చయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. అందుకు తగ్గట్లు ప్రణాళికలు రచిస్తూ, పెట్టుబడులను సమకూరుస్తూనే, పారిశ్రామికవేత్తలకు అనువుగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. ఫలితంగా నిర్ణయించిన గడువు కంటే ఏడాది ముందే ఉత్పత్తులు ప్రారంభించేలా సెంచరీ ప్యానెల్స్ సంస్థ రూపుదిద్దుకుంది. గోపవరం సమీపంలోని నెల్లూరు రహదారిలో రూ.956 కోట్లతో అంచనాతో చేపట్టిన ఈ పరిశ్రమ నిర్మాణానికి 2021 డిసెంబరు 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పరిశ్రమకు అవసరమైన మౌలిక సదుపాయాల పట్ల దృష్టి సారించారు. బ్రహ్మంసాగర్ నుంచి 0.07టీఎంసీ నీరు సరఫరాకు అవసరమైన అనుమతులిచ్చి రూ.45కోట్లుతో పైపులైన్ పనులు 6 నెలల్లో పూర్తి చేశారు. రూ.19.1కోట్లతో 132కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. స్థానికులకు ప్రత్యక్ష ఉద్యోగావకాశాలు లభించాయి. 2662 ఉద్యోగాలు ఉండగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం 75 శాతం స్థానికులకు ఇవ్వాల్సి ఉంది.అయితే ఇప్పటికి 78శాతం మందికి చైర్మన్ సజ్జన్ భజాంకా అవకాశం కల్పించడం విశేషం.

- సెంచరీ ప్యానెల్స్ పరిశ్రమ 589.23 ఎకరాల్లో రూ.956 కోట్ల అంచనాతో శ్రీకారం చుట్టినా పెట్టుబడులు రూ.1600 కోట్లకు చేరాయి. 2024 డిసెంబర్ నాటికి ఉత్పత్తి లక్ష్యం కాగా, 2023 డిసెంబర్ నాటికి రెండు దశల పనులు కూడా పూర్తి చేశారు. కాగా ఈపరిశ్రమ ద్వారా పరోక్షంగా మరో 4వేల మందికి ఉపాధి దక్కనుంది.
- లక్ష్యానికి ఏడాది ముందే నిర్మించిన సెంచరీ ప్యానెల్స్ సంస్థను శనివారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ఉన్న ఊరిలోనే ఉద్యోగాలు



ప్రభుత్వ ముందుచూపు వల్ల స్వగ్రామాల్లోనే యువతకు ఉద్యోగావకాశాలు లభించాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెంచరీ ప్లైబోర్డ్స్ సంస్థను గోపవరం సమీపంలో నెలకొల్పారు. రేపు సీఎం చేతుల మీదుగా ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. – డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ

గడువు కంటే ముందే పూర్తి



పరిశ్రమ పనులు వేగంగా పూర్తయ్యాయి. అవసరమైన నీరు, విద్యుత్ సరఫరా పనులను ప్రభుత్వం 6 నెలల్లో సమకూర్చింది. చైర్మన్ సజ్జన్ భజాంకా చొరవ తీసుకొని రెండోదశ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. –రమేష్‌కుమార్‌రెడ్డి, జీఎం, సెంచరీ పానెల్స్

క్లుప్తంగా

నాలుగు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్‌బియ్యం తరలిస్తున్న వాహనం

మదనపల్లె : రేషన్ షాపుల్లో ప్రజలకు పంపిణీ చేసిన బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా కర్నాటకకు తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి, నాలుగుటన్నుల రేషన్‌బియ్యాన్ని సీజ్ చేసినట్లు సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని మాలిక్ ఫంక్షన్‌హాల్ సమీపంలోని ఈశ్వరమ్మకాలనీకి చెందిన హబీబ్ స్థానికంగా ఇంటింటికీ తిరిగి రేషన్ బియ్యాన్ని సేకరించి, కర్నాటకకు తరలిస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం సుమారు 103 బస్తాల్లో నాలుగు టన్నులకు పైగా రేషన్ బియ్యాన్ని మినీ టెంపోలో వేసుకుని కర్నాటకకు తరలిస్తుండగా, ముందుగా వచ్చిన సమాచారం మేరకు వాహనాన్ని సీజ్ చేశామన్నారు. బియ్యాన్ని తరలిస్తున్న నిందితుడు హబీబ్‌ను అరెస్ట్ చేశామన్నారు. అలాగే బుధవారం రాత్రి అమ్మచెరువుమిట్ట వద్ద వన్‌టౌన్ ఎస్ఐ హరిహరప్రసాద్ వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, సీటీఎం హరిజనవాడకు చెందిన కోటకొండ రెడ్డెప్ప రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతడి నుంచి 13 బస్తాల్లో 620 కిలోల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె : జూదం ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ శేఖర్ తెలిపారు. మండల పరిధిలోని బొమ్మనచెరువు పంచాయతీ సందిరెడ్డి గారిపల్లె సమీపంలో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. దాడుల్లో ఐదుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.10,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన బాలాజీ

పుల్లంపేట : మండల పరిధిలోని పుత్తనవారిపల్లి గ్రామంలో గురువారం రాత్రి తిరుపతి నుంచి రాజంపేటకు వెళ్తున్న టిప్పర్ రోడ్డు దాటుతున్న బాలాజీ(30)ని ఢీ కొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పుల్లంపేట ఎస్ఐ రఘురాం సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రొద్దుటూరులో ఐటీ సోదాలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని కేసీ పుల్లయ్య ఇంట్లో గురువారం ఐటీ అధికారులు సోదాలు చేశారు. కేసీపీ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పేరుతో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో కొన్నేళ్ల నుంచి పనులు చేస్తున్నారు.

క్రికెట్ స్టేడియం నిర్మాణానికి
గ్రామస్తుల సహకారం మరువలేనిది

- ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి
- అన్నమయ్య జిల్లాకు క్రికెట్ స్టేడియం ఒక మణిహారం
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



క్రికెట్ స్టేడియం పెవిలియన్ భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, గ్రామ సర్పంచ్ తదితరులు

రాయచోటి : అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి సహకరించిన నక్కవాండ్లపల్లి గ్రామస్తులకు చేతులెత్తి నమస్కరిస్తున్నానని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఉదయం రాయచోటి మండలం, నక్కవాండ్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన క్రికెట్ స్టేడియాన్ని ఆయన జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నక్కవాండ్లపల్లి గ్రామస్తుల సహకారంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు 29 ఎకరాలలో క్రికెట్ స్టేడియం నిర్మించగలిగామన్నారు.

అంతర్జాతీయ స్థాయికి క్రికెట్ స్టేడియం

భవిష్యత్తులో ఈ క్రికెట్ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. సాప్ వైస్ చైర్మన్‌గా నూతనంగా నియమితులైన ధ్యానచంద్రతో మాట్లాడానని, ఇక్కడ ఉన్న క్రికెట్ స్టేడియంకు అనుగుణంగా కబడ్డీ, ఖోఖో లాంటి క్రీడలను కూడా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. గ్యాలరీ, డ్రైనేజీ పనులను రూ. 75 లక్షలతో త్వరలో చేపట్టనున్నారన్నారు. స్టేడియం నిర్మాణంలో సహాయ సహకారాలు అందించిన ముఖ్యమంత్రి ఓఎస్‌డీ ధనుంజయరెడ్డికి, జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ క్రికెట్ స్టేడియం అన్నమయ్య జిల్లాకు ఒక మణిహారమని కొనియాడారు. రాయచోటిలో నూతనంగా నిర్మించిన క్రికెట్ స్టేడియంను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. నూతనంగా ఏర్పాటైన అన్నమయ్య జిల్లా అభివృద్ధికి మౌలిక సదుపాయాలు చాలా ముఖ్యమన్నారు. వాటిలో భాగంగానే శిల్పారామం, నగరవనం లాంటి అభివృద్ధి పనులను మన జిల్లాకు కేటాయించారన్నారు. ఫుట్‌బాల్ లాంటి ఇతర క్రీడలకు ఇండోర్ స్టేడియం నిర్మాణం కోసం రూ. 50 కోట్లతో ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపించామన్నారు.

శిలాఫలకం ఆవిష్కరణ

క్రికెట్ స్టేడియంకు అనుబంధంగా గ్యాలరీ, డ్రైనేజీ సిస్టమ్, పాదచారులకు వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, కలెక్టర్ గిరీషా పీఎస్, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ గురు మోహన్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్అండ్‌బీ ఎస్ఈ సహదేవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, నక్కవాండ్లపల్లి సర్పంచ్ ప్రభావతమ్మ, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం

ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



సుమిత్ర, పోలి మురళీరెడ్డిలతో పాటు ఇతర సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

రాజంపేట టౌన్ : వైఎస్సార్‌సీపీలో జెండాలు మోసి పార్టీకోసం కష్టపడి పనిచేసే వారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి పదవులు ఇస్తున్నారని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో గురువారం మార్కెట్‌కమిటీ చైర్మన్ ములక్కాయల సుమిత్ర, వైస్ చైర్మన్ పోలి మురళీరెడ్డిలతో పాటు పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. ములక్కాయల మురళీమోహన్‌రెడ్డి అలియాస్ పోలి మురళీరెడ్డి యుక్త వయస్సు నుంచే వైఎస్ కుటుంబానికి వీరాభిమాని అన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో, ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఓ కార్యకర్తగానే పార్టీకోసం అంకితభావంతో పనిచేస్తున్నాడని, అందువల్లే ఆయన కుటుంబానికి మార్కెట్‌యార్డు పదవి లభించిందన్నారు. కార్యకర్తలను గుర్తించి సముచిత స్థానం కల్పించే ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఎన్నికల్లో పనితీరును బట్టి జగన్ మరోమారు సీఎం కాగానే పదవుల కేటాయింపులో కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. జగన్ సీఎం అయితేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సుమిత్ర, పోలి మురళీరెడ్డి మాట్లాడుతూ తమపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. రైతులకు సేవ చేసే అవకాశం రావడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డిలకు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు చొప్పా ఎల్లారెడ్డి, గొబ్బిళ్ళ త్రినాథ్, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జెనుగు కృష్ణారావుయాదవ్, నందలూరు మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర, జేసీఎస్ పట్టణ ఇన్‌చార్జి వడ్డే రమణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, దాసరి పెంచలయ్య, మిర్యాల సురేఖ, నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి పెద్దఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

ముక్కోటి ఏకాదశికి ముమ్మర ఏర్పాట్లు

- సామాన్య భక్తులకు పెద్దపీట
- వీఐపీలు ఉదయం 7 గంటల లోపే దర్శించుకోవాలి



ముక్కోటికి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన చరిత్రాత్మక నందలూరు శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయంలో ఈనెల 23వ తేదీన ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని టీటీడీ సివిల్ డిప్యూటీ ఈఈ నాగరాజు, ఏఈలు రవి, అమర్‌నాథరెడ్డిల ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ ఉదయం 5 గంటల నుంచి దర్శనం ఉంటుందన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని తెలిపారు. వీఐపీలు ఉదయం 7 గంటల లోపే దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. భక్తులు ఎలాంటి అసౌకర్యానికి లోను కాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజంపేట డీఎస్పీ చైతన్య, మన్నూరు సీఐ మంజునాథ రెడ్డి, ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్‌ల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఉంటుందన్నారు. బస్టాండ్ నుంచి వచ్చే వాహనాలకు నందలూరు షాదీఖానా వద్ద, టంగుటూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు నందలూరు హరిజనవాడ వద్ద పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఆలయ అర్చకులు సునీల్ కుమార్, సాయి కృష్ణలు మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనంతోపాటు, శ్రీ పాంచరాత్ర ఆగమోక్తంగా లక్ష తులసీ అర్చన, శ్రీవారికి విశేష పుష్పాలంకరణ, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

కలెక్టరేట్‌లో ఘనంగా క్రిస్మస్ హై–టీ

- క్రీస్తు విలువలను ముందుకు తీసుకెళ్లాలి
- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



క్రిస్మస్ హై–టీ కార్యక్రమంలో పాస్టర్లతో కలిసి కేక్ కట్ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : క్రీస్తు విలువను ముందుకు తీసుకెళ్లాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ హై–టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హాజరై క్యాండిల్ వెలిగించి, క్రిస్మస్ ట్రీ లైట్లను స్విచ్ ఆన్ చేసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. దయ, కరుణ, దాతృత్వం కల్గిన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి దారి చూపుతాయన్నారు. యేసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ రోజును ప్రజలందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి షేక్ ఇమ్రాన్, క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులు, పాస్టర్‌లు, చర్చి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి

కమాండెంట్ శ్రీనివాసరావు



బెటాలియన్ స్పోర్ట్స్‌మీట్ పోటీల్లో భాగంగా వాలీబాల్ ఆడుతున్న బెటాలియన్ పోలీసులు

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో జరిగే క్రీడా పోటీలలో పోలీసు సిబ్బంది గెలుపోటములను సమానంగా తీసుకోవాలని బెటాలియన్ కమాండెంట్ ఎస్. శ్రీనివాసరావు తెలిపారు. భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో గురువారం రెండవ రోజు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2023 పోటీలు జరిగాయి. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ కె. ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్లు కె. వెంకట్‌రెడ్డి, వి. కేశవరెడ్డి, వి. జయప్రసాద్, పి.ఎస్.డి. ప్రసాద్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

నవశకం

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే సర్టిఫికెట్లు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో నాకు పలు రకాల సర్టిఫికెట్లు ఇంటి వద్దకే వచ్చి అందించారు. గతంలో ఇదే సర్టిఫికెట్లు కావాలంటే కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగాను. కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. వలంటీర్లు సచివాలయాల ద్వారా ఇంటి వద్దకే వచ్చి కుల, ఆదాయ ధ్రువ పత్రాలు అందజేశారు.

– పి.శివారెడ్డి, చిన్నమండెం, అన్నమయ్య జిల్లా

అమ్మ ఒడి ఆదుకుంది



నా భర్త హరి హోటల్‌లో మేనేజర్‌గా పని చేస్తున్నారు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద బాబు దేవాన్ష్ మూడో తరగతి చదువుతున్నాడు. పాప ఇంటి వద్ద ఉంది. బాబుకు అమ్మ ఒడి కింద రూ.15 వేలు వచ్చింది. పాఠశాలలో బాబుకు జగనన్న విద్యా కానుక కింద పుస్తకాలు, యూనిఫాం ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని బాబును బాగా చదివిస్తున్నాం.

– భువనేశ్వరి, కాలేజీ రోడ్డు, మదనపల్లె.

24న రాష్ట్రస్థాయి తాళ భజన పోటీలు

రాజుపాళెం : వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వాముల ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 24న ఆదివారం రాత్రి రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో తాళ భజన పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి తెలిపారు. వివరాలకు 9948308196 నంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

మద్యం సేవించి ఆటో నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కడప అర్బన్ : మద్యం సేవించి ఆటో నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి 7 రోజుల జైలు శిక్షతో పాటు, రూ. 2500 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్ స్పెషల్ జేఎఫ్‌సీఎం కోర్టు గురువారం తీర్పు చెప్పింది. చల్లా నారాయణ స్వామి (36) అనే వ్యక్తి ఈనెల 19న మద్యం సేవించి ఆటో నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల బ్రీత్ అనలైజర్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో కోర్టు శిక్ష విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలకు గాయాలు

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మహిళలు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. రామారావు కాలనీకి చెందిన నరసింహులు భార్య జి.కల్యాణి(28) ఇంటివద్ద నుంచి గొల్లపల్లె సర్కిల్‌కు నడుచుకుంటూ వస్తుండగా, శేషసాయి కల్యాణమండపం వద్ద ఎదురుగా వచ్చిన కారు ఆమెను ఢీకొంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా ఎన్‌టీఆర్ సర్కిల్‌కు చెందిన వెంకటేష్ భార్య శ్రీదేవి(45) స్థానికంగా నడిచి వస్తుండగా, ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆమె గాయపడగా, స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతిచెందిన వెంకటేష్

మదనపల్లె : పట్టణంలోని శివాజీనగర్‌లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన గురువారం సాయంత్రం వెలుగుచూసింది. వైఎస్సార్ జిల్లా చాపాడు మండలం తప్పెట ఓబాయపల్లె గ్రామానికి చెందిన ఓబన్న కుమారుడు బి.వెంకటేష్(40) వృత్తిరీత్యా వెల్డర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బతుకుతెరువులో భాగంగా నెలరోజుల క్రితం స్వగ్రామం నుంచి మదనపల్లెకు చేరుకుని శివాజీనగర్‌లో అద్దె ఇల్లు తీసుకుని నివాసం ఉంటున్నాడు. ఎస్టేట్‌లోని రామకృష్ణ వెల్డింగ్‌షాప్‌లో పనిచేస్తున్నాడు. గురువారం వెంకటేష్ పనికి రాకపోవడంతో వెల్డింగ్‌షాపులోని తోటిపనివారు మధ్యాహ్నం సెల్‌కు ఫోన్‌చేశారు. ఫోన్ రింగ్ అవుతున్నప్పటికీ సమాధానం రాకపోవడంతో సాయంత్రం ఏమైందోనని ఇంటివద్దకు వెళ్లారు. ఇల్లు తాళం వేసి ఉండగా, కిటికీలో నుంచి లోపలకు చూశారు. ఇంటిలో అనుమానాస్పద స్థితిలో పడి ఉన్న వెంకటేష్‌ను చూసి చనిపోయి ఉంటాడని భావించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి సమాచారం సేకరించారు. ఇల్లు తాళం వేసి ఉండటం, కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఇంటి తాళం తెరవలేదు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు తెలిపారు. వారు వచ్చిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలిస్తామని పోలీసులు చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఇన్‌చార్జి సీఐ వలీబాషు, ఎస్ఐ ఇనయతుల్లా తెలిపారు.

ఓటరు జాబితా సవరణ తనిఖీ



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకుడు, జేసీ తదితరులు

రాయచోటి : రాయచోటిలో చేపడుతున్న ఓటర జాబితా సవరణను అన్నమయ్య జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకుడు మురళీరెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రాయచోటిలోని మహబూబ్ బాషా వీధిలో సవరణ ప్రక్రియలో ఉన్న బీఎల్ఓలతో వివిధ అంశాలపై పలు ప్రశ్నలు అడిగి తగు సూచనలు చేసి ఓటర్ల జాబితాపై సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకు ముందు రాయచోటి నియోజకవర్గంలోని తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించి తగు సూచనలు చేశారు. వీరి వెంట రాయచోటి ఆర్డీఓ రంగస్వామి పాల్గొన్నారు.

ఉపాధిలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

డ్వామా పీడీ మద్దిలేటి



సామాజిక తనిఖీ బహిరంగ సమావేశంలో ఉపాధి సిబ్బందిని విచారిస్తున్న డ్వామా పీడీ మద్దిలేటి

కలికిరి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో సిబ్బంది అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. కలికిరి మెయిన్ స్కూల్ ఆవరణలో గురువారం ఉపాధి హామీ మండల 17వ సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది లక్ష్యం మేరకు కూలీలకు పనిదినాలు కల్పించాలన్నారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెల వరకు మండలంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన 1294 పనులకు సంబంధించి ఎస్ఆర్‌పీ ఆధ్వర్యంలో డీఆర్‌పీలు, సిబ్బంది తనిఖీలు నిర్వహించిన నివేదికలను గ్రామాల వారిగా చదివి వినిపించారు. నివేదికలను పరిశీలించిన ఆయన మండలంలో మొత్తం 1294 పనులకు గాను రూ.6,10,32,654 ఖర్చు కాగా వీటిలో రూ.50,228 అక్రమాలకు గురైనట్లు గుర్తించిన పీడీ ఆయా ఫీల్డ్ అసిస్టెంట్‌ల నుంచి నగదు రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భానుప్రకాష్, అంబుడ్స్‌మెన్ శివప్రసాద్, క్వాలిటీ కంట్రోల్ అధికారి ఉమామహేశ్వర్, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, ఎంపీడీఓ గంగయ్య, ఏపీఓ సుజాత, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని రామారావు కాలనీకి చెందిన మహేష్ భార్య సరస్వతి(25) కుటుంబ సమస్యలతో బుధవారం రాత్రి నిద్రమాత్రలు మింగింది. అదేవిధంగా అనపగుట్టకు చెందిన రఘునాథరెడ్డి భార్య ఆర్.గాయత్రి(27), భార్యాభర్తలు గొడవపడి మనస్తాపంతో గురువారం నిద్రమాత్రలు మింగింది. పట్టణంలోని చీకలగుట్ట గౌతమీనగర్ శివాలయం వీధికి చెందిన పి.హరీష్(35) తల్లితో గొడవపడి మనస్తాపంతో ఇంటివద్దే ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.